క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కార్యకర్త చిన్నారికి పరామర్శ



వైఎస్సార్‌సీపీ కార్యకర్త చిన్నారిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: వాడ్రాపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త యల్లపు చిన్నారిని సోమవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ పరామర్శించారు. చిన్నారి వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల వెల్డింగ్ పనులు చేపడుతుండగా ఆటో తనపై పడిపోవడంతో గాయాలయ్యాయి. అనకాపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొంది ఇటీవల వాడ్రాపల్లికి వచ్చారు. విషయం తెలుసుకున్న ప్రసాద్ గాయాలపాలైన చిన్నారిని పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ నేతలు పెతకంశెట్టి రామజోగినాయుడు, మళ్ల కన్నుంనాయుడు, పాల్గొన్నారు.

నరసింహావతారంలో జగన్నాథుడు



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: మండలంలోని నాగులాపల్లి, మునగపాక గ్రామాల్లో సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు సోమవారం నరసింహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి ఆయా గ్రామాల్లో జగన్నాథుని భక్తులు దర్శించుకున్నారు. ఈ నెల 6న పండగను ఘనంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ఉద్యోగ విరమణ ఉపాధ్యాయులకు సత్కారం



విజయకుమారిని సత్కరిస్తున్న గ్రామస్తులు

ఎస్.రాయవరం: ధర్మవరం అగ్రహారం పాఠశాలలో సోమవారం ఉద్యోగ విరమణ చేసిన సాంఘికశాస్త్ర ఉపాధ్యాయిని పొంగులేటి విజయకుమారిని తోటి ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు ఎ.ఎస్.ఎస్.ప్రశాంతి, వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి శ్రీనివాసరావు, తల్లిదండ్రుల కమిటీ వైస్ చైర్మన్ తేలు రాంబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గస్తీ కోసం ప్రత్యేక బైక్

పాయకరావుపేట: స్థానిక పోలీసు స్టేషన్‌లో నర్సీపట్నం ఎస్‌డీపీవో పి.శ్రీనివాసరావు ట్రాఫిక్ క్లియరెన్స్, గస్తీ కోసం సమకూర్చిన బైక్‌ను సోమవారం ప్రారంభించారు. స్థానిక స్టేషన్‌కు ప్రభుత్వం ఓ బైక్‌ను ఏర్పాటు చేసింది. ట్రాఫిక్ క్లియరెన్స్, స్కూళ్ల వద్ద, రాత్రి సమయంలో గస్తీ కోసం ఈ బైక్‌ను వినియోగించనున్నట్లు ఎస్‌డీపీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ జి.అప్పన్న, ఎస్‌ఐలు పురుషోత్తం, పి.గోవిందరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్‌లో ఖాళీ సీట్లకు దరఖాస్తులు

మునగపాక: మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులకు సంబంధించి ఈ నెల 5వ తేదీలోగా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు మోడల్ స్కూల్‌లో సంప్రందించాలని ఆమె కోరారు.

సామాజిక భవన నిర్మాణానికి భూమి పూజ


మునగపాక: తోటాడ పంచాయతీ గవర్ల అనకాపల్లిలో సామాజిక భవన(బంగ్లా) నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. భవనం శిథిలావస్థకు చేరడంతో ప్రభుత్వం రూ.పది లక్షలు మంజూరు చేయడంతో సంబంధిత పనులను సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు, ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, తదితరులు ప్రారంభించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఎస్.రాయవరం:కొరుప్రోలు, పెదగుమ్ములూరు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లలో చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. కొరుప్రోలు ఎస్ఎస్ పరిధిలో సోమిదేవపల్లి, కొరుప్రోలు పరిశ్రమలకు, చినఉప్పలం ఆక్వా చెరువులకు, గెడ్డపాలెం, గుడివాడ హేచరీస్‌కు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు, తిమ్మాపురం, కోనవానిపాలెం, కొరుప్రోలు గ్రామాలకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. పెదగుమ్ములూరు సబ్‌స్టేషన్ పరిధిలో పెదుగమ్ములూరు గ్రామానికి ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

యలమంచిలిలో కటిక చీకటి..!

- పట్టణంలో అస్తవ్యస్తంగా వీధి దీపాల నిర్వహణ
- ఏటా రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నా.. అంధకారంలోనే జనం
- సిబ్బంది కొరతతో యంత్రాంగం సతమతం



బీసీటీ ఆస్పత్రి వీధిలో వెలగని వీధిలైటు

యలమంచిలి రూరల్: యలమంచిలి పట్టణంలో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. వీటి నిర్వహణకు నెలకు రూ.2 లక్షల వరకు ప్రైవేటు ఏజెన్సీకి చెల్లిస్తున్నా.. చీకట్లు మాత్రం తొలగడం లేదు. శివారు గ్రామాలు, ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లలో సైతం పలు చోట్ల వీధి దీపాలు మిణుకుమిణుకుమంటున్నాయి. ఫలితంగా ప్రజలు అంధకారంలోనే మగ్గిపోవాల్సి వస్తోంది. పురపాలక సంఘానికి చాలా వార్డుల నుంచి తరచూ ఇవే ఫిర్యాదులు వస్తున్నాయి. ఇక విలీన గ్రామాల్లో పరిస్థితి మరింత దయనీయంగా ఉంటోంది. పట్టణంలో కొన్ని చోట్ల ఎప్పుడు వీధి దీపాలు వెలుగుతాయో.. ఎప్పుడు ఆరిపోతాయో.. తెలియని పరిస్థితి నెలకొంది.



గాంధీనగరం వీధిలో అంధకారం

30 శాతమే వెలుగులు

యలమంచిలి మున్సిపాలిటీలో 25 వార్డుల్లో సుమారుగా 3,500 వీధి దీపాలున్నాయి. వీటిలో 50 శాతం మాత్రమే వెలుగుతున్నాయి. 18 వాట్లు, 20 వాట్లు, 40 వాట్లు, 70 వాట్లు, 90వాట్లు, 110 వాట్ల సామర్థ్యం ఉన్న ఎల్ఈడీ బల్బులు ప్రాంతాన్ని బట్టి వినియోగిస్తున్నారు. వీటిలో ప్రతి రోజూ 60 నుంచి 70 లైట్లు పాడైపోతున్నాయి. వీధి దీపాల నిర్వహణ బాధ్యతను ఒక ప్రైవేటు ఏజెన్సీ చూస్తోంది. ఏజెన్సీ తరఫున ఇద్దరు, మున్సిపాలిటీ నీటి సరఫరా విభాగానికి చెందిన మరో ఇద్దరు వీధి దీపాల రిపేర్లు, ఆధునిక లైట్ల ఏర్పాటు, ఇతరత్రా పనులు చేస్తుంటారు. విద్యుత్ బిల్లు కోసం పురపాలక సంఘం నెలకు సుమారు రూ.7 లక్షలు ఖర్చు చేస్తోంది. ఇంత ఖర్చు చేస్తున్నా సిబ్బంది కొరత, ఇతర సమస్యలతో పురపాలక సంఘం పరిధిలో వీధి దీపాలు సరిగ్గా వెలగడం లేదు. వాస్తవానికి 98 శాతం వీధి దీపాలు వెలిగేలా చూడాల్సిన బాధ్యత నిర్వహణ బాధ్యత చూస్తున్న ఏజెన్సీపై ఉంది. అయినప్పటికీ ప్రజలు నిత్యం వీధి దీపాలు వెలగడం లేదన్న సమస్యలను ఎక్కువగా అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తున్నారు. ముఖ్యంగా యలమంచిలి పట్టణ పరిధిలో జీవిత బీమా కూడలి నుంచి గాంధీనగరం వెళ్లే రహదారి, రంగావారి వీధి, బీసీటీ ఆస్పత్రి వీధి, ఉలక్ పేట సాయిబాబా గుడి పరిసరాలు, రాంనగర్‌లో కొన్ని వీధులు సహా పలు చోట్ల వీధి లైట్లు వెలగడం లేదని ఆయా ప్రాంతాల ప్రజలు చెబుతున్నారు. ప్రధాన కూడళ్లు, రద్దీగా ఉండే వీధుల్లో, అంతర్గత రహదారుల్లో అంధకారం లేకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



రంగావారి వీధిలో వెలగని లైటు



ఎల్ఐసీ కూడలిలో వెలగని వీధిలైటు



రంగావారి వీధిలో అంధకారం

ఒంటరిగా వెళ్లాలంటే భయం..



ఎల్ఐసీ కూడలి నుంచి గాంధీనగరం వెళ్లే ప్రధాన రహదారి ప్రారంభంలో వీధిలైట్లు వెలగకపోవడంతో చీకట్లు అలముకున్నాయి. వర్షాకాలం కావడంతో పాములు, విషకీటకాల సంచారంతో భయంగా ఉంటోంది. ముఖ్యంగా మహిళలు ఒంటరిగా నడిచి వెళ్లడానికి ఆందోళన చెందుతున్నారు. వీధిలైట్లు పూర్తి స్థాయిలో వెలిగేలా చూడాలి. పలు ప్రాంతాల్లో పగటి సమయంలో కూడా వీధి దీపాలు వెలుగుతున్నాయి. దీని వల్ల విద్యుత్ వృథా అవుతోంది.

– షేక్ బషీరా, గాంధీనగరం

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు

పురపాలక సంఘంలో వీధి దీపాల నిర్వహణ ప్రైవేటు ఏజెన్సీకి కాంట్రాక్టు ఇస్తున్నాం. వీధి దీపాల మరమ్మతులకు గురైనా, వెలగకపోయినా ఎప్పటికప్పుడు వెలిగేలా చర్యలు తీసుకుంటున్నాం. సిబ్బంది కొరత కూడా ఉంది. అయినప్పటికీ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. ఎక్కడైనా వీధి లైట్ల సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే తగు చర్యలు తీసుకుంటాం.

– మోకా/నాజీ, మున్సిపల్ ఏఈ

ప్రజలను నిలువునా ముంచిన కూటమి ప్రభుత్వం



క్యూర్ కోడ్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, తదితరులు

- బాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- కార్యకర్తలే పార్టీకి బలం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్

అచ్యుతాపురం రూరల్ : షరతులు లేని సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పి కూటమి ప్రభుత్వం ప్రజలను నమ్మించి మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ధ్వజమెత్తారు. బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలని పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం అచ్యుతాపురం లేపాక్షి కల్యాణ మండపంలో యలమంచిలి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం పార్టీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్రావు అధ్యక్షతన జరిగింది. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను ఎలా మోసం చేస్తుందో నిరూపించడానికి క్యూఆర్ కోడ్ టెక్నాలజీని రూపొందించామన్నారు. ఈ క్యూఆర్ కోడ్‌ద్వారా గ్రామ స్థాయి నుంచి ప్రజలను బాబు ఎలా మోసం చేశారో స్పష్టంగా వివరించాలన్నారు. గతంలో వలే కాకుండా ఇక నుంచి పార్టీ కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటామని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పించారన్నారు.

పార్టీ అనకాపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ మోసానికి ప్యాంట్ షర్ట్ వేస్తే అది చంద్రబాబు నాయుడు అని, అలాగే వేషానికి రంగులేస్తే అది పవన్ కల్యాణ్ అని ఎద్దేవ చేశారు. సూపర్ సిక్స్ పథకాల్లో పెన్షన్‌ను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 65 లక్షల మందికి ఇస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం 49 లక్షల మందికే అందిస్తుందని చెప్పారు. చోడవరం నుంచి రాంబిల్లి ఎస్పీ వోబీ వరకూ బండరాళ్ల లారీలు తిరగడంతో రోడ్లన్నీ శిథిలమై ప్రమాదాలకు కారణమవుతున్నాయని చెప్పారు.

పార్టీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకురాలు శోభా హైమావతి మాట్లాడుతూ తల్లికి వందనం పథకం కింద 2024–25 సంవత్సరానికి రూ.12వేల కోట్లు ఎగనామం పెట్టారన్నారు. రైతు భరోసాను అన్నదాతా సుఖీభవగా మార్చి అన్నదాతలను అనాథ దాతలుగా కూటమి ప్రభుత్వం చేసిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు పథకం తుస్సుమందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పున ఇస్తామని హామీ ఇచ్చి 14 నెలలు గడిచినా అతీగతీ లేదన్నారు. సర్పంచ్, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, తదితర చిరు ఉద్యోగులకు తల్లికి వందనం పథకం వర్తింపజేయకుండా కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు.



విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు

నియోజకవర్గ సమన్వయకర్త యు.వి.రమణమూర్తి రాజు(కన్నబాబురాజు) మాట్లాడుతూ మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితేనే నాయకులకు, కార్యకర్తలకు మంచి అవకాశాలు వస్తాయన్నారు. గ్రామాల్లో కార్యకర్తలు విస్తృతంగా బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు బొడ్డేడ ప్రసాద్, బోదెపు గోవింద్, అనకాపల్లి జిల్లా మహిళా అధ్యక్షురాలు సుజాత, అచ్యుతాపురం ఎంపీపీ కోన సంధ్యాబుజ్జి, జెడ్పీటీసీలు లాలం రాము, దూళి నాగరాజు, సేనాపతి సంధ్యారాము, పెంటకోట సోము సత్యనారాయణ, కో–ఆప్షన్ జెడ్పీటీసీ నర్మాల కుమార్, రాంబిల్లి ఎంపీపీ గొట్టుముక్కల శిరీషా శ్రీనుబాబు, పార్టీ ప్రెసిడెంట్ కిషోర్ రాజు, యలమంచిలి పట్టణ పార్టీ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్య దొర, పార్టీ మండల అధ్యక్షులు కొల్లి త్రినాథ్, పార్టీ మండల అధ్యక్షుడు ఆడారి అచ్చిన్నాయుడు, నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం



సమస్యను వివరిస్తున్న సర్పంచ్ గోపాలకృష్ణ

కోటవురట్ల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం తూతూమంత్రంగా నిర్వహించారు. ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు అధ్యక్షతన సమావేశ మందిరంలో జరిగిన ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ ఆర్ఎస్ సీతారామరాజు శాఖల వారీ సమీక్ష చేశారు. వ్యవసాయాధికారి సరోజిని మాట్లాడుతూ మండలంలోని రైతు సేవా కేంద్రాలలో ఖరీఫ్ సీజనుకు వరి విత్తనాలు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. పాములవాక రైతు సేవా కేంద్రంలో డ్రోన్ స్ప్రేయర్ అందుబాటులో ఉందని, ఎకరాకు మందు స్ప్రే చేసేందుకు రూ.300 నుంచి రూ.400 ఖర్చు అవుతుందని తెలిపారు. చౌడువాడ సర్పంచ్ గోపాలకృష్ణ మాట్లాడుతూ ఏపీవో నాగరాజు ప్రోటోకాల్ పాటించడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏవో చంద్రశేఖర్, ఈవోపీఆర్డీ రఘురాం, మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పూడిమడక రోడ్డులో భారీ వాహనాలను నియంత్రించాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కార్యదర్శి ప్రసాద్

మునగపాక: పూడిమడక రోడ్డులో భారీ వాహనాలను నియంత్రించి ప్రమాదాలు జరగకుండా చూడాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ కోరారు. పరిమితికి మించి భారీ వాహనాలు పగటిపూట కూడా తిరగడంతో రాకపోకలు సాగించే వారు భయాందోళనకు గురవుతున్నారన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రసాద్ మాట్లాడారు. పూడిమడక రోడ్డులో భారీ వాహనాల రాకపోకల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా అధిక లోడుతో వాహనాల రాకపోకల వల్ల పలు ప్రమాదాలు జరుగుతుండడంతో పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీసుకువచ్చామన్నారు. రాత్రి పూట తప్ప జనసంచారం ఉండే పగటి పూట భారీ వాహనాలు వెళ్లకుండా కట్టడి చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. దీంతో ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయన్నారు. మళ్లీ యథావిధిగా పూడిమడక రోడ్డులో భారీ వాహనాలు పగటి సమయంలో పెద్ద ఎత్తున ప్రయాణం సాగించడంతో వాహన చోదకులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. రెండు, మూడు రోజుల్లో పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్‌ను కలిసి ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరుతూ వినతి అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు దిమ్మల అప్పారావు, భీశెట్టి గంగప్పలనాయుడు, పార్టీ నేతలు నరాలశెట్టి సూర్యనారాయణ, ఆడారి కాశీబాబు, పిన్నమరాజు రవీంద్రరాజు, కాండ్రేగుల జగన్ పాల్గొన్నారు.

ఎంపీడీవో సేవలు శ్లాఘనీయం



కాశీవిశ్వనాథరావును సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు, అధికారులు

కోటవురట్ల: ఎంపీడీవోగా పనిచేసిన కాశీవిశ్వనాథరావు సేవలు శ్లాఘనీయమని మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు కొనియాడారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పదవీ విరమణ చేసిన ఎంపీడీవో కాశీవిశ్వనాథరావును సోమవారం మాజీ ఎమ్మెల్సీతో వైస్ ఎంపీపీ ఆర్ఎస్ సీతారామరాజు, అధికారులు సత్కరించారు. మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖలో 38 ఏళ్లపాటు ఎటువంటి మచ్చ లేకుండా పనిచేసిన కాశీవిశ్వనాథరావు అభినందనీయులన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఆర్ఎస్ రామచంద్రరాజు, ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ఎస్ సత్యనారాయణరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, ఏవో చంద్రశేఖర్, ఈవోపీఆర్డీ రఘురాం, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ ఉమాదేవి కుటుంబానికి పరామర్శ



జెడ్పీటీసీ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్

కోటవురట్ల: జెడ్పీటీసీ సిద్ధాబత్తుల ఉమాదేవి, సత్యనారాయణ దంపతుల కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే, అనకాపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జ్ కరణం ధర్మశ్రీ, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, మాజీ ఎమ్మెల్సీ, కాకినాడ పార్లమెంట్ పరిశీలకుడు డి.వి.సూర్యనారాయణరాజు సోమవారం పరామర్శించారు. సిద్ధాబత్తుల సత్యనారాయణ తండ్రి చంటి అప్పారావు ఇటీవల మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ మేరకు కైలాసపట్నంలోని ఉంటున్న ఉమాదేవి, సత్యనారాయణ దంపతులు, ఉప సర్పంచ్ సిద్ధాబత్తుల నాగేశ్వరరావులకు కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం చంటి అప్పారావు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ చిక్కాల రామారావు, పార్టీ నాయకులు శెట్టి రమణ, గెంజి రమణ, చీకట్ల జగదీష్, శానాపతి రామునాయుడు, పైల నాని, పెన్నాడ రాంబాబు, నానాజీ, సురేష్, ఆంజనేయులు, చామంతుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై మంత్రి సమీక్ష



మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

పాయకరావుపేట: స్థానిక పంచాయతీరాజ్ అతిథి గృహంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సోమవారం 'స్వర్ణాంధ్ర విజన్ 2047' సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం రూ.లక్షా 30 వేల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయన్నారు. టాయ్ పరిశ్రమ రాకతో 25 వేల మంది మహిళలకు ఉద్యోగాలు రానున్నాయన్నారు. ఈ సమావేశంలో నాలుగు మండలాలకు చెందిన ఆయా శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

శివదత్ దృష్టికి రేషన్ డీలర్ల సమస్య



శివదత్‌కు రేషన్ డీలర్ల సమస్యలు వివరిస్తున్న అప్పారావు

ఎస్.రాయవరం: రేషన్ డిపోల నుంచి సరకులు ఇచ్చే క్రమంలో తలెత్తే సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర పౌర సరఫరాల డైరెక్టర్ బోడపాటి శివదత్‌ను రేషన్ డీలర్లు కోరారు. ధర్మవరం అగ్రహారంలో సోమవారం జరిగిన డీలర్ల సమావేశానికి శివదత్‌ను ఆహ్వానించారు. ముందుగా శివదత్‌ను సత్కరించారు. మండల డీలర్ సంఘం అధ్యక్షుడు పోలినాటి అప్పారావు పలు గ్రామాల్లో డీలర్లు పడుతున్న ఇబ్బందులను వివరించారు. డిపోల ద్వారా రేషన్ సరఫరా చేసేటప్పుడు శివారు గ్రామాల వారికి రేషన్ ఇచ్చేందుకు ట్రాన్స్‌పోర్ట్ ఇబ్బందులు తలెత్తుతున్నట్టు చెప్పారు. వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బందులు రాకుండా రేషన్ సరకులు అందిస్తున్నామని, ఇలా చేసినందుకు అదనపు అలవెన్స్ ఇచ్చి డీలర్లను ఆదుకోవాలన్నారు. ఈ మేరకు స్పందించిన శివదత్ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయానికి ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేస్తే దశల వారీగా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డీలర్లు బుజ్జి, కన్నా, రమణ, రాము, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణకు ఘన నివాళి



సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కంబాల, చిక్కాల

పాయకరావుపేట: పాల్మన్‌పేటలో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్‌సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు బొడ్డు హరిబాబు తండ్రి సత్యనారాయణ పెద్ద కర్మ సోమవారం జరిగింది. పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంబాల జోగులు, పార్టీ మండల అధ్యక్షులు చిక్కాల రామారావు.. సత్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, సీనియర్ నాయకులు ధనిశెట్టి బాబూరావు, జగతా శ్రీనివాసరావు, సర్పంచ్ చేపల నాగమణి తాతాజీ, తిరుమల రాజు నరసింహరాజు, ఎంపీటీసీ పులగల రాంబాబు, వైలపల్లి శివాజీ, సింగిరి గోవిందు, మైలపల్లి బాబ్జి, మైలపల్లి కాసులు, గరికిన రమణ, సింగిరి రమణ దూడ తాతారావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడిని పరామర్శించిన కంబాల



తూము రమణను పరామర్శిస్తున్న కంబాల జోగులు

పాయకరావుపేట: వైఎస్సార్‌సీపీ అరట్లకోట గ్రామ శాఖ అధ్యక్షుడు తూము రమణను సోమవారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంబాల జోగులు పరామర్శించారు. రమణ కాలికి ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్నారు. జోగులుతో పాటు ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, పాయకరావుపేట ఉపసర్పంచ్ జగతా భవాని శ్రీనివాస్, గ్రామ నాయకులు గర్లంక వెంకటసూరి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పెనుమత్స నాగేశ్వరరావు తదితరులు రమణను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.